సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 3 । డిసెంబర్ । 2022

మోగింది కల్యాణ వీణ



రాజవొమ్మంగి: దాదాపు నాలుగు నెలల తరువాత పెళ్లి భజంత్రీలు శుక్రవారం మళ్లీ మోగాయి. రెండవ తేదీ అర్ధరాత్రి (తెల్లవారితే శనివారం) మంచి ముహూర్తం ఉండడంతో ఎక్కడ చూసినా పెళ్లి సందడి కనిపించింది. జిల్లాలో ఈ ఒక్కరోజే 500 వరకు పెళ్లిళ్లు జరిగినట్టు ఓ అంచనా. దీంతో కళ్యాణ మండపాలు, దేవస్థానాలు కిక్కిరిసి కనుపిస్తున్నాయి. ఆ తరువాత వరసుగా 3,4,5,6,7,5,14,16, 17, 18 తేదీల్లో కూడా శుభముహూర్తాలు ఉన్నాయి.



వావ్ నేవీ షో IIలో

న్యూస్‌రీల్

నేడు,రేపు ప్రత్యేకంగా ఓటర్ల నమోదు



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి

సాక్షి, పాడేరు: జిల్లాలోని 1008 పోలింగ్ కేంద్రాల్లో 3,4 తేదీల్లో ప్రత్యేక కాంపెయిన్ ద్వారా ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి తెలిపారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు..కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దయానిధి మాట్లాడుతూ బీఎల్‌వోలందరూ ఉదయం 8 గంటల నుంచి సాయింత్రం 5 గంటల వరకు ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులను కోరారు.

అరకులోయలో స్కిల్ కాలేజీ

సాక్షి, పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక స్కిల్ కాలేజీ ప్రారంభించనున్నట్టు కలెక్టర్ సుమీత్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సహకారంతో అరకులోయలో స్కిల్ కాలేజీ ప్రారంభిస్తున్నామని, ఇక్కడ హౌస్ కీపింగ్ మేనేజర్, ఫుడ్ అవుట్‌లెట్ మేనేజర్ కోర్సులకు సంబంధించి శిక్షణ అందిస్తారని తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన వారు శిక్షణకు అర్హులని, 5 నుంచి 6 నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలను కల్పిస్తారని తెలిపారు.

జూనియర్ కళాశాలను సందర్శించిన ఆర్‌జేడీఐఈ



వై.రామవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఆర్‌జేడీఐఈ శారద

వై.రామవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆర్‌జేడీఐఈ శారద శుక్రవారం సందర్శించారు. నాడు-నేడు పథకంలో ఆ కళాశాలలో సుమారు రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ప్రిన్సిపాల్ ఈశ్వరకృపకు సూచించారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు.

ఇంటి వద్దే వైద్యసేవలు

డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య

కూనవరం: రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలను ఇంటి వద్దే అందిస్తోందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తెలిపారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇంటి ముందుకు వచ్చిన వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఆధ్వర్యంలో 90 రకాల ముందులు ఉచితంగా అందజేయనున్నట్టు తెలిపారు. 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించే ఏర్పాటు ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కూనవరం వైద్యాధికారి గౌతమి, హెల్త్ అసిస్టెంట్లు డి.శ్రీనివాస్, అంజిబాబు, కె.భద్రకాళి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవనాల పరిశీలన

కూనవరంలో పాత ఆస్పత్రి భవనాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవనం నిర్మాణం జరిగే వరకు చిన్నచిన్న మరమ్మతులు చేపట్టి పాత ఆస్పత్రిలో వైద్యసేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. స్థానిక వైద్యాధికారిని గౌతమి తదితరులు పాల్గొన్నారు.

గండి పోశమ్మ ఆలయం అక్కడే..!

- తరలించకుండా ఉండేందుకు చర్యలు
- సంగమేశ్వర ఆలయం తరహాలో చుట్టూ బావి నిర్మాణం కోసం ప్రతిపాదనలు
- ఆ ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, అధికారుల బృందం



కర్ణాటక రాష్ట్రంలోని సంగమేశ్వర ఆలయాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, అధికారులు





గోదావరి వరదలో గండిపోశమ్మ ఆలయం (ఫైల్) (ఇన్‌సెట్) అమ్మవారి విగ్రహం

రంపచోడవరం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ముంపునకు గురవుతున్న గిరిజనుల ఆరాధ్య దేవత గండిపోశమ్మ ఆలయాన్ని అక్కడే ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దేవీపట్నం మండలం గోదావరి తీరంలోని గొందూరు వద్ద ఉన్న మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్‌కు కూతవేటు దూరంలో ఉంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఈ ఆలయం పూర్తిగా నీట మునిగిపోతుంది. దీంతో ఈ ఆలయాన్ని తరలించవలసి వస్తుందని భావించారు. గోదావరి తీరంలోని ఆదివాసీలతో పాటు సుదూర ప్రాంతంలో ఉన్న అనేక మంది భక్తులు నిత్యం గండి పోశమ్మ ఆలయాన్ని సందర్శిస్తారు. ప్రతీ ఏటా ఉగాది అనంతరం పెద్ద ఎత్తున ఇక్కడ జాతర నిర్వహిస్తారు. భక్తకోటి ఆరాధ్యదైవ మైన గండిపోశమ్మ ఆలయాన్ని ఎలాగైనా అక్కడే ఉండేలా చూసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్న కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సంగమేశ్వర ఆలయాన్ని సంరక్షించిన విధంగానే ఇక్కడా చర్యలు తీసుకునేందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఈ బృందంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, దేవీపట్నం ఎంపీపీ కుంజం మురళీ, దేవాదాయ శాఖ జేడీ, రీజినల్ జాయింట్‌కమిషనర్ ఎం.వి.సురేష్ బాబు, డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు, అసిస్టెంట్ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్, డీఈఈ శ్రీనివాస్,ఈఈ సతీష్ ఇతర అధికారులు ఉన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ నిర్మాణం కారణంగా సంగమేశ్వర ఆలయం ముంపునకు గురయ్యే పరిస్థితిలో ఆలయం మునిగిపోకుండా చుట్టూ బావి తరహా నిర్మాణం చేశారు. ఆలయాన్ని సందర్శించేందుకు మెట్లు నిర్మించారు. అదే తరహాలో గండి పోశమ్మ ఆలయం చుట్టూ ఇన్‌టెక్ వెల్ నిర్మించి, అమ్మ వారి సందర్శనకు మెట్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదిస్తున్నారు. సాధ్యాసాధ్యాలను ప్రత్యేకంగా పరిశీలించేందుకు ప్రతినిధుల బృందం అక్కడకు వెళ్లింది.

స్వయంభూగా వెలిసిన అమ్మవారు

గండిపోశమ్మ అమ్మవారి ఆలయం రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచింది.అత్యంత పురాతన దేవాలయం. అమ్మవారు ఇక్కడ స్వయంభూగా వెలిశారు. అమ్మవారు సోదే వారి ఆడపడుచుగా పేరుగాంచారు. పాపికొండలకు వెళ్లే గోదావరి మార్గం ప్రారంభంలో ఈ ఆలయం ఉంది. పాపికొండలకు వెళ్లేందుకు వచ్చే పర్యాటకులు రాజమహేంద్రవరం నుంచి 45 కిలోమీటర్లు ప్రయాణించి పోశమ్మగండి ఆలయం వద్దకు చేరుకుంటారు. అనేక మంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని తమ పాపికొండల విహారయాత్రను ప్రారంభిస్తారు. ఏటా సుమారు 3 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ప్రతీ ఆది, మంగళవారంలో 50 వేల మంది భక్తులు ఇక్కడికి వస్తారు. ఏటాఉగాది తరువాత ఐదు రోజుల పాటు గండిపోశమ్మఅమ్మవారి జాతర నిర్వహిస్తారు. జాతర రోజు అమ్మవారిని గొందూరు నుంచి సోదే వారు ఊరేగింపుగా పోశమ్మ గండికి తీసుకువస్తారు.అప్పటి నుంచి జాతరప్రారంభమవుతుంది. దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో ఉన్న అమ్మవారి ఆలయానికి ఏటా రూ. 30లక్షలు వరకు ఆదాయం వస్తోంది.

ఆలయానికి సమీపంలో కొండ

పోశమ్మ గండి ఆలయం వద్ద పెద్ద కొండ ఉండడం వల్ల ఇన్‌టెక్ వెల్ నిర్మించడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. రాజమహేంద్రవరం నుంచి పురుషోత్తపట్నం వచ్చిన భక్తులు కొండ నుంచి ఏర్పాటు చేసే మెట్ల ద్వారా గుడికి చేరుకోవచ్చు.రెండు రోజుల పాటు సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, దేవదాయశాఖ అధికారుల బృందం సంగమేశ్వర ఆలయం నమునా ప్లాన్‌తో ఇరిగేషన్ శాఖ ద్వారా పోశమ్మగండి ఆలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రతిపాదనలు ఇవ్వనున్నారు.

గిరిజనుల విశ్వాసాన్ని కాపాడేందుకు..



గిరిజనుల విశ్వాసాన్ని కాపాడేందుకు, ఆరాధ్య దైవం గండిపోశమ్మ ఆలయాన్ని అక్కడే ఉంచే విధంగా కృషి చేస్తున్నాం.దీనిలో భాగంగా సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించాం. అదే మాదిరిగా ఇక్కడ నిర్మాణం చేయడం ద్వారా ఆలయాన్ని పోలవరం ప్రాజెక్టు ముంపు నుంచి రక్షించుకోవచ్చు.

–నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్యే రంపచోడవరం

మారుమూల గ్రామాలకు రోడ్డు సదుపాయం

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



కానివాడ రోడ్డును పరిశీలిస్తున్న పీవో సూరజ్ గనోరే

మారేడుమిల్లి: మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. వై.రామవరం మండలం కానివాడ గ్రామానికి వెళ్లే రహదారిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కానివాడ రహదారి అధ్వానంగా ఉందని సర్పంచ్ పల్లాల శిల్పారాణి స్పందనలో ఫిర్యాదు చేశారని చెప్పారు. దీంతో రోడ్డును పరిశీలించేందుకు వచ్చినట్టు తెలిపారు. రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు తయారు చేసి, అందజేయాలని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులను పీవో ఆదేశించారు. అనంతరం బంద ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. కాంట్రాక్టర్ తాజా కూరగాయాలు తీసుకువచ్చే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో ఉంటే వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పీవో వెంట పీఆర్ ఏఈ రవితేజ తదితరులున్నారు.

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ సుమిత్ కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : స్పందనలో వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణతో కలిసి ప్రజల నుంచి 76 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలన్నారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శుక్రవారం ఉదయం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారని చెప్పారు. సమస్యలను పరిష్కరించకలేకపోతే ఎందుకు పరిష్కారంకాలేదో వివరిస్తూ అర్జీదారుని ఫొటోతో పాటు వెబ్‌సైట్ పెట్టాలన్నారు. జిల్లా అధికారులు రెడ్‌క్రాస్ సొసైటీలో జీవితకాల సభ్యులుగా చేరాలని, రక్తసేకరణకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ జె.శివ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, ట్రైనీ కలెక్టర్ శ్రీవాత్సవ, జిల్లా సైనిక సంక్షేమాధికారి టి.సత్యానందం, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, డీఈవో రమేష్, జిల్లావైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జమీల్ బాషా, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

అవి చిరుత పాదముద్రలు !

ఫోక్స్‌పేట రేంజ్ అధికారి కరుణాకర్



దొరమామిడి అటవీప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది సేకరించిన చిరుత పాదముద్ర



గంగవరం మండలం దొరమామిడి అటవీప్రాంతంలో పాదముద్రలు సేకరిస్తున్న అటవీశాఖ సిబ్బంది

గంగవరం: రంపచోడవరం డివిజన్ పరిధిలో సంచరిస్తున్న వన్యమృగం చిరుతపులిగా భావిస్తున్నట్టు ఫోక్స్‌పేట రేంజ్ అధికారి కరుణాకర్ తెలిపారు. గత నెల25న ఫోక్స్‌పేట అటవీ రేంజ్ పరిధిలో కన్నారం , రామన్నపాలెం, ఎర్రంపాలెం ప్రాంతాల్లో వన్యమృగం(పెద్దపులి) సంచరిస్తున్నట్టు వచ్చిన సమాచారంపై అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఫోక్స్‌పేట రేంజ్ అధికారి కరుణాకర్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది.. పాదముద్రల సేకరణ పనిలో పడ్డారు. మండలంలోని పిడతమామిడి ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో దొరమామిడి, ఆముదాలబంద అటవీ ప్రాంతంలో జంతువుల పాదముద్రలను ఫారెస్టు అధికారులు శుక్రవారం గుర్తించారు. దీనిపై రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ మాట్లాడుతూ ఆ పాదముద్రలను బట్టి చిరుత పులిగా భావిస్తున్నామన్నారు. పెద్దపులి కాదని చెప్పారు. ఈ జంతువు సంచారంపై నిఘా పెట్టామన్నారు. పలు చోట్ల ట్రాప్‌కెమెరాలు కూడా అమరుస్తున్నట్టు కరుణాకర్ తెలిపారు. పాదముద్రలను పరిశీలిస్తే ఇప్పటికే ఈ జంతువు దట్టమైన అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది భావిస్తున్నట్టు చెప్పారు. ఎవరికైనా ఈ జంతువు (చిరత) జాడ తెలిస్తే సమాచారం అందించాలని, దానికి ఏవిధమైన హాని చేయరాదని కరుణాకర్ కోరారు. ఆయన వెంట డీఆర్వో టి.రాజా, ఎఫ్‌బీవోలు జగదీష్, మనోహర్ తదితరులు ఉన్నారు.

నాడు-నేడులో కచ్చితంగా నిబంధనలు పాటించాలి

జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బెన్నస్వామి



నాడు నేడు పనులను పరిశీలిస్తున్న జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బెన్నస్వామి

ముంచంగిపుట్టు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు-నేడు పనుల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాలని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బెన్నస్వామి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం నాడు-నేడులో రూ.98,83,788 వ్యయంతో జరుగుతున్న మేజర్, మైనర్ పనులు,నూతన మరుగుదొడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యా బోధన,మెనూ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ సకాలంలో నాడు-నేడు పనులు పూర్తి చేయాలన్నారు. పనులకు సంబంధించిన ఖర్చులపై కళాశాల కమిటీ తీర్మానం చేశాకే చెల్లింపులు చేయాలని,ముందస్తుగా చెల్లింపులు చేయరాదని, ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ నెల 12 నుంచి 17 వరకు జరిగే అర్థ సంవత్సర పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు దామోదరం,రమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు

మావోయిస్టుల పీఎల్‌జీఏ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా ఏవోబీ వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు.



వై.రామవరం మండలం మీదుగా అటవీప్రాంతంలోకి వెళుతున్న పోలీసు బలగాలు



మోహనాపురం అటవీ ప్రాంతంలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ , పోలీసు సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలో ముంచంగిపుట్టు నుంచి కుమడ వెళ్లే మార్గంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు దారిపొడవునా తనిఖీలు నిర్వహించాయి. బాంబ్ స్క్వాడ్‌తో కల్వర్టులు,వంతెనలు పరిశీలించారు.స్థానిక ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో తనిఖీలు జరిపారు. మండలకేంద్రానికి కుమడ,డుడుమ,జోలాపుట్టు మార్గాల వైపునుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. జోలాపుట్టు,ఒనకఢిల్లీ సరిహద్దు ప్రాంతంలో వాహనాల రాకపోకలపై బీఎస్ఎఫ్ బలగాలు నిఘా పెట్టాయి. జోలాపుట్టు నైట్ హాల్ట్ ఆర్టీసీ బస్సులను మండల కేంద్రంలో గురువారం రాత్రి నిలిపివేశారు. మారుమూల గిరిజనులు గ్రామాలకే పరిమితమై బిక్కుబిక్కుమంటూ ఉన్నారు.

వై.రామవరం: ఏవోబీలో పోలీసులు విస్తృతంగా కూంబింగు నిర్వహిస్తూ అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు.అనుమానితులు, అపరిచితులపై నిఘా పెట్టారు. మారుమూల ప్రాంతాలకు వెళ్ల వద్దని ప్రజాప్రతినిధులు, నాయకులను పోలీసులు హెచ్చరించారు. వై.రామవరం మండలం మీదుగా అటవీ ప్రాంతంలోకి కూంబింగ్ నిర్వహణకు శుక్రవారం భారీ ఎత్తున పోలీసుబలగాలు వెళ్లాయి.

గంగవరం: స్థానిక ఎస్ఐ చినబాబు ఆధ్వర్యంలో శుక్రవారం మోహనాపురం అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనాపురం పరిసర గ్రామాల్లో గిరిజనులతో పోలీసులు మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం వరకూ మోహనాపురం అటవీ ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావం ఉండేది.

చింతూరు: మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాల సందర్భంగా అప్రమత్తమైన చింతూరు పోలీసులు మండలంలోని చట్టిలో జాతీయ రహదారిపై విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ యాదగిరి ఆధ్వర్యంలో పోలీసులు చట్టి, కూనవరం జంక్షన్‌లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న వాహనాలను సోదా చేశారు. బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల్లో విస్తృతంగా సోదాలు చేస్తున్నారు.



చింతూరు మండలం కూనవరం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ

రెండో రోజూ మూతపడిన చాపరాయి



చాపరాయిలో తొలగించిన చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న కార్మికులు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం రెండో రోజూ మూతపడింది. జలపాతం వద్ద చెత్త పేరుకుపోవడంతో దానిని తొలగించడం కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు జలపాతం సందర్శనకు పర్యాటకులను అనుమతించలేదు. శుక్రవారం పంచాయతీ కార్మికులతో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ట్రాక్టర్‌తో చెత్తను తరలించారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఉన్నతాధికారులు

పాడేరు రూరల్ : సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఈనెల 7న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, ట్రైనీ కలెక్టర్ శ్రీవాత్సవ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ భారత సైనికుల దేశ భక్తి, ధైర్యసాహసాలు, త్యాగాల పట్ల దేశం గర్విస్తోందన్నారు. వీర జవానులకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు చేయూత ఇచ్చేందుకు సాయుధ పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పతాక దినోత్సవ నిధికి పౌరులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు విరివిగా విరాళాలు ఇచ్చి, మాజీ సైనికుల సంక్షేమానికి తోడ్పడాలని కోరారు. విరాళాలకు ఆదాయపు పన్ను రాయితీ ఉంటుందన్నారు.

లోచలిపుట్టు వీధిలో కార్డెన్ సెర్చ్



లోచలిపుట్టు వీధిలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ సుధాకర్, ఎస్ఐ లక్ష్మణ్

పాడేరు రూరల్ : మావోయిస్టు పీఎల్‌జీఏ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పాడేరు సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. పాడేరు పట్టణంలోని లోచలిపుట్టు వీధిలో సీఐ సుధాకర్, ఎస్ఐ లక్ష్మణ్ సిబ్బందితో కలిసి శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.

ఇంటింటికీ వెళ్లి నివాసం ఉంటున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థానికంగా అద్దెకు ఉంటున్న వారి ఆధార్ కార్డులను తనిఖీ చేశారు. ఇతర ప్రాంతాల నుంచి కొత్తగా ఎవరైన వచ్చి అద్దెకు దిగినా, అనుమానితులు, కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరించినా తమకు సమాచారం ఇవ్వాలని స్థానికులను సీఐ కోరారు. అంతకు ముందు పోలీసు సిబ్బందికి కార్డెన్ సెర్చ్ నిర్వహణ, పీఎల్‌జీఏ వారోత్సవాల సందర్భంగా చేపట్టవలసిన తనిఖీలపై అవగాహన కల్పించారు.

పూదేడులో ..

రాజవొమ్మంగి : మండలంలోని మారుమూల ప్రాంతమైన పూదేడులో పోలీసులు శుక్రవారం ఏరియా డామినేషన్ ఆపరేషన్ చేపట్టారు. సివిల్ పోలీసులతో పాటు స్పెషల్ పోలీసు బలగాలు ఏరియా డామినేషన్ ప్రక్రియలో పాల్గొన్నట్టు జడ్డంగి ఎస్ఐ షరీఫ్ తెలిపారు.ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేసినట్టు చెప్పారు.

క్లుప్తంగా

గిరిజన యువతి అదృశ్యం


కిముడు కుమారి

జి.మాడుగుల : ముంచంగిపుట్టు మండలం చెక్కరాయి పంచాయతీ, కొండపాడు గ్రామానికి చెందిన కిముడు మత్స్యరాజు కుమార్తె కిముడు కుమారి అక్టోబర్ 20న జి.మాడుగుల బంధువుల ఇంటికి వచ్చింది. నవంబర్ 15న తమ గ్రామానికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. అయితే అప్పటి నుంచి ఆమె ఆచూకీ తెలియలేదని తమ్ముడు పాంగి వెంకట్ తెలిపారు. ఆమె కోసం తమ బంధువుల ఇళ్లలో ఆరా తీశామని అయినా ఫలితం లేదని తెలిపారు. కుమారి ఆచూకీ తెలిసిన వారు 9441853422, 9391988438 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


స్వాధీనం చేసుకున్న బెల్లం పులుపు

చోడవరం రూరల్ : చోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కె.కోటపాడు మండలంలో శుక్రవారం జరిపిన దాడులలో 400 లీటర్ల పులిసిన బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్టు ఇన్‌స్పెక్టర్ సిహెచ్.జోగమ్మ చెప్పారు. కె.కోటపాడు మండలం కొరువాడ గ్రామం శివార్లలో జరిపిన గాలింపులో అక్రమంగా నాటుసారా తయారు చేయడానికి సిద్ధం చేసిన బెల్లం పులుపును కనుగొన్నామన్నారు.

వావ్.. నేవీ షో

- సాగరం.. సంభ్రమాశ్చర్యం...
- ఫైనల్ రిహార్సల్ అదరహో
- రెప్పవాల్చకుండా చూసిన సందర్శకులు


సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న నేవీ సిబ్బంది


బాంబులు కురిపిస్తున్న మిగ్ విమానం

సాక్షి, విశాఖపట్నం : సాగర జలాల్లో యుద్ధ నౌకల కవాతు.. గగన తలంలో హెలికాప్టర్ల పహారా.. శత్రు మూకలపై నేవీ కమాండోల కదన దూకుడు.. రివ్వును దూసుకొచ్చిన మిసైల్స్.. దానితో పోటీ పడేటట్లుగా మెరుపు వేగంతో వెళ్లిన యుద్ధ విమానాలు.. మొత్తంగా.. రామకృష్ణ బీచ్.. రణరంగాన్ని తలపించింది. ఒళ్లు గగుర్పొడిచేలా నిర్వహించిన నేవీ విన్యాసాలా రిహార్సల్.. యుద్ధ వాతావరణాన్ని మించిపోయేలా చేసింది. ఉవ్వెత్తున ఎగిసిపడిన జనసంద్రం నడుమ ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని.. నింపిన నౌకాదళ విన్యాసాలలో సాగర తీరం సంభ్రమాశ్చర్యాలకు కేంద్రంగా మారింది. నేవీ సాహసికులు ప్రదర్శించిన పలు విన్యాసాలు సందర్శకులకు కనువిందు చేశాయి. ప్రతి విన్యాసం అబ్బురపరిచింది. నింగి, నేలా తేడా లేదనేలా సాగిన విన్యాస ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకించిన ప్రజలు సరికొత్త అనుభూతిని పొందారు. నేవీ డే ఉత్సవాల్లో భాగంగా తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఆర్కె బీచ్‌లో శుక్రవారం చేపట్టిన చివరి రిహార్సల్స్ అబ్బుర పరిచాయి. జెమినీ బోట్లలో దూసుకొచ్చిన నౌకాదళం విన్యాసాలు బీచ్ సందర్శకుల్ని ఆకట్టుకున్నాయి. యుద్ధ ట్యాంకర్లతో శత్రుసేనపై విరుచుకుపడిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డిసెంబర్ 4వ తేదీన నేవీ డే సందర్భంగా సాగర జలాల్లో నేవీ సిబ్బంది ఏటా విన్యాసాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకూ సాగిన రిహార్సల్స్ చూపరుల్ని ఆకట్టుకున్నాయి. గగన తలంలో యుద్ధ విమానాలు నిర్వహించిన విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచాయి. ఆర్కె బీచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన నేవీ తాత్కాలిక కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు విన్యాసాల్ని పర్యవేక్షించారు.

వలంటీర్ల నిబద్ధత


పాడేరు జిల్లా ఆస్పత్రిలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న ఉక్కుర్బ వలంటీర్


పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గడికించుమండ గ్రామ వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్

హుకుంపేట: మండలంలోని గ్రామ వలంటీర్లు తమ విధులు సక్రమంగా అందించడమే కాకుండ అంతకు మించిన పనులు చేస్తు శభాష్ అనిపించుకుంటున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిసున్నారు. ఒకటో తేదీ రాగానే లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్ సొమ్మును గ్రామ వలంటీర్లు అందజేస్తున్నారు. పింఛన్‌దారులు ఎక్కడ ఉన్నా వారి వద్దకు వెళ్లి ఠంఛన్‌గా పింఛన్ అందిజేస్తూ బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల పింఛన్ పంపిణీలో భాగంగా ఈ నేపథ్యంలో మండలంలోని తడిగిరి, ఉక్కుర్బ, గడికించుమండ గ్రామాలకు చెందిన తాపుల చిన్నలమ్మ, తలారి కాసులమ్మ అనే వృద్ధులు అనారోగ్యంతో పాడేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ద్వారా మంజూరైన పింఛన్‌ను ఆయా ప్రాంత గ్రామ వలంటీర్లు నేరుగా ఆస్పత్రికి వెళ్లి పింఛన్ సొమ్మును వారికి అందజేశారు. వారి సేవలకు ఆయా గ్రామల గిరిజనులు తదితరులు అభినందించారు.

బైకు దొంగల ముఠా అరెస్టు

తొమ్మిది వాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బైకులను చూపుతున్న సీఐ సుధాకర్

పాడేరు రూరల్ : మూడు నెలలుగా పాడేరు, జి.మాడుగుల, పెదబయలు ప్రాంతాల్లో వరుస బైకు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర బైకు దొంగల ముఠాను శుక్రవారం పాడేరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పాడేరు సీఐ సుధాకర్ తెలిపిన వివరాలివి. పాడేరు, పెదబయలు, జి.మాడుగుల ప్రాంతాల్లో ఇటీవల బైకులు చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసిన పోలీసులు బైకు దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకోవడానికి చర్యలు తీసుకున్నారు. ఎట్టకేలకు శుక్రవారం ముగ్గురు బైకు దొంగలను అరెస్ట్ చేశారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా చిత్రకొండ మండలం దగుడిగుడి గ్రామానికి చెందిన ఈ ముగ్గురు వద్ద తొమ్మిది పల్సర్ బైకులకు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో పాడేరు ఎస్‌ఐ లక్ష్మణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కిల్లోగుడ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయుల

దుంబ్రిగుడ: కిల్లోగుడలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్టు హెచ్‌ఎం కళావతి శుక్రవారం తెలిపారు. కొర్రా శుభలక్ష్మి షాట్ పుట్, కొర్రా జ్యోతి, గెమ్మెలి వసంత ఖోఖో పోటీలో, కొర్రా నీలమ్మ వాలీబాల్ విభాగంలో అర్హత సాధించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన మండల, జిల్లా స్థాయి పోటీల్లో వారు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులను పీడీ కమల రాము, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

పార్టీ బలోపేతానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ

చింతపల్లి రూరల్: ఏజెన్సీలో సీపీఐ బలోపేతానికి కృషి చేస్తామని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణ మూర్తి అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో శుక్రవారం పార్టీ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పేదలకు ఎంతో అన్యాయం జరుగుతుందన్నారు. ఏజెన్సీలో పార్టీకి పూర్వ వైభవం తీసుకోచేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గిరిజన సమ్యాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజుబాబు, నాయకులు పోతరాజు, సత్తిబాబు, దేముడు పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు


గాయపడిన కామరాజును ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

హుకుంపేట : మండలంలోని తీగలవలస పంచాయతీ ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామమైన పాములాయిలో లారీ, బైక్ ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కామయ్యపేట గ్రామం వైపు నుంచి ఒడిశా వైపు వెళ్తున్న లారీ పాములాయి నుంచి వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో పాములాయి గ్రామానికి చెందిన మర్రి కామరాజు అనే 25 ఏళ్ల యువకుడికి కుడి కాలు విరిగింది. ప్రమాద సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ప్రైవేటు వాహనంపై తీసుకువెళ్లి అక్కడ నుంచి 108 వాహనం ద్వారా పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


రత్నాకర్ స్వామి

యలమంచిలి : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపిన వివరాలివి. యలమంచిలి మున్సిపాలిటీలో తెరువుపల్లి గ్రామానికి చెందిన జాజుల రత్నాకర్‌స్వామి గురువారం సాయంత్రం యలమంచిలి పెంజెరువు జంగుళూరు వద్ద వున్న వరి పొలానికి నీరు పెట్టడానికి మోటారుకు అవసరమైన డీజిల్ తీసుకొని నడిచి వెళుతుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన రత్నాకరస్వామిని యలమంచిలి ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్సానంతరం మేరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు శుక్రవారం సాయంత్రం స్థానిక విలేకరులకు తెలిపారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా శాంతి స్థూపం


సంతలో ఏర్పాటు చేసిన శాంతిస్థూపం


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

గూడెంకొత్తవీధి: మావోయిస్టులకు వ్యతిరేకంగా మండలంలోని పెదవలస వారపు సంతలో శుక్రవారం తాత్కాలిక శాంతి స్థూపాన్ని ఏర్పాటు చేశారు. మావోయిస్టుల చేతిలో ఇదివరకు హత్యకు గురైన వారి వివరాలను స్థూపంపై పేర్కొన్నారు. సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. 2013లో హత్యకు గురైన వంతల రాజుబాబు, 2010లో మరణించిన సాగిన సోమలింగం,అప్పటి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఉగ్రంగి సోమలింగం పేర్లను రాశారు. గతంలోనూ పోలీసులు ఇదే మాదిరిగా సంతల్లో శాంతి స్థూపాలను ఏర్పాటు చేశారు.

వాహన తనిఖీలు

సంతకువచ్చే ప్రాంతంలో కొయ్యూరు సీఐ స్వామినాయుడుతో కలిసి గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్,సహాయ కమాండంట్ దేవేంద్రనాథ్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేసి, అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు.

ఇతరుల హక్కులకు భంగం కలిగించడం నేరం

సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ

చోడవరం రూరల్: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుంటూనే పొరుగువారి హక్కులకు భంగం కలిగించొద్దని, అది చట్టరీత్యా నేరమవుతుందని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజ్యాంగ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్య వక్తగా ఆమె మాట్లాడారు. రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి, దానిని గౌరవించాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా చట్టం పట్ల అవగాహన కల్పించడమే గాకుండా పేదలకు న్యాయ సహాయం అందిస్తున్నామని తెలిపారు. అంతకు ముందు వ్యాసరచన పోటీల్లో విజేత విద్యార్థులు రాజేష్, రోహన్, అబ్దుల్ నవాబ్‌లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ చైనులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న సన్యాసి

పాయకరావుపేట : మండలంలోని మంగవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు భార్య దేవి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ అప్పలరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దేశంశెట్టి సన్యాసి(32) గత నెల 26న పొలంలోకి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. వ్యవసాయంలో నష్టాలు ఎక్కువగా వస్తున్నాయని, అప్పులు చేయాల్సి వస్తోందని ఈ బాధలు భరించలేక పురుగు మందు తాగానని భార్యతో చెప్పాడు. స్పృహ తప్పి పడిపోయిన ఇతన్ని కుటుంబ సభ్యులు తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించినట్టు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

దుర్గాకాలనీలో వ్యక్తి హత్య


హత్యకు గురైన అప్పారావు


ఘటనా స్థలంలో కుటుంబ సభ్యులను విచారిస్తున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట : పట్టణంలోని దుర్గాకాలనీలో గురువారం రాత్రి ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన చిలుకూరి చిన అప్పారావు(47) పాత సీసాలు సేకరించి అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. కాలనీలో రేకుల షెడ్లో నివసిస్తున్నాడు. రాత్రి 11గంటలకు తల్లి దగ్గర భోజనం చేసి సమీపంలో ఉన్న రేకుల షెడ్లోకి వెళ్లి నిద్రించాడు. ఉదయం అతను పడుకున్న గదికి సమీపంలో కుక్కలు అరవడంతో బంధువులు వెళ్లి చూడగా అప్పారావు మృతి చెంది పడి ఉన్నాడు. అతనిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో తలపై కొట్టడంతో రక్తస్రావమై మరణించినట్టు అనుమానిస్తున్నారు. మృతుడి కుమార్తె ఇంజరపు శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీము, డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలం వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈహత్యా ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అప్పలరాజు తెలిపారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం


చెరకుంపాలెంలో పొలం వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్న ఏడీఏ, అధికారులు, వలంటీర్లు

- మొదటి రోజు 24 టన్నుల ధాన్యం సేకరణ
- ఏడీఏ కంకిపాటి సావిత్రి

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన తరువాత మొదటి సారిగా శుక్రవారం 24 టన్నుల ధాన్యం సేకరించి (కొనుగోలు చేసి) లారీల ద్వారా మిల్లుకు పంపామని అడ్డతీగల ఏడీఏ కంకిపాటి సావిత్రి తెలిపారు. ఇటీవల ఈ కేంద్రాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఏడీఏ సావిత్రి మాట్లాడుతూ శుక్రవారం నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్టు తెలిపారు. వీఏఏ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మరో ఐదు రోజుల్లో జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ధాన్యం కేంద్రాలు

ముందుగా ప్రకటించినట్లుగానే ఈ వారాంతానికి జిల్లాలో అన్ని మండలాల్లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరుస్తామని సివిల్ సప్లయ్స్ డీఎం గణేశ్‌కుమార్ తెలిపారు. 6వ తేదీన గంగవరం మండలంలో-రెండు, దేవీపట్నం మండలంలో-మరో రెండు కేంద్రాలు తెరుస్తున్నట్టు ఆయన తెలిపారు.

మిగిలిన మండలాల్లో కూడా వెంట వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామని, రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

నక్కపల్లి: కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఇటీవల సీబీఎస్‌ఈ సిలబస్ విద్యార్థులకు సౌత్ జోన్- 1 (తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి) యోగా చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో శ్రీప్రకాష్ విద్యార్థులు జి. సోమ సూర్యకిరణ్, ప్రథమ, బి. దేవాన్ష్ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.ఎన్. మూర్తి శుక్రవారం తెలిపారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన వీరిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నర్సింహరావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.